క్లుప్తంగా

అమరావతి సీఐగా శ్రీనివాసరావు



అమరావతి: అమరావతి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా మాకినేని శ్రీనివాసరావు శుక్రవారం అమరావతి సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఒంగోలు డీటీసీ సీఐగా పనిచేసిన శ్రీనివాసరావు అమరావతి సీఐగా నియమించబడ్డారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన ఎ.వి.బ్రహ్మం వీఆర్‌కు బదిలీ అయ్యారు. సీఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలు కాపాడటానికి ప్రజలతో మమేకమై, అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేస్తానన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్తెనపల్లి: పట్టణంలో 11 కేవీ లైన్‌లో చెట్లు కొట్టడం, సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సత్తెనపల్లి టౌన్‌లో శనివారం (నేడు) ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సత్తెనపల్లి టౌన్ విద్యుత్ ఏఈ పి.రవికిరణ్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. ఏదైనా విద్యుత్‌కు సంబంధించిన సమస్యలకు సత్తెనపల్లి టౌన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబరు 9494116238 కు ఫోన్ చేయాలన్నారు.

అమరావతిలో...

అమరావతి: మండల పరిధిలోని ఉంగుటూరు సబ్‌స్టేషన్‌లో 33 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా శనివారం మండల పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆ శాఖ ఏఈ అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కర్లపూడి, లేమల్లె, ఉంగుటూరు, నెమలికల్లు, మండెపూడి, అలాగే తుళ్లూరు మండలంలో రాయపూడి, అనంతవరం, నెక్కల్లు, పెదపరిమి గ్రామాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులందరూ సహకరించాలని ఆయన కోరారు.

బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి నివాళులు

క్రోసూరు: ప్రజాసేవకే పరితపించిన మహోన్నత వ్యక్తి కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య అని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రవిబాబు అన్నారు. సీపీఎం మాజీ పొలిట్‌బ్యూరో సభ్యులు, బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య గురువారం మృతి చెందిన సందర్భంగా సీపీఎం పార్టీ నాయకులు క్రోసూరులోని ఆమంచి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించింది. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ బెంగాల్ రాష్ట్రానికి కామ్రేడ్ జ్యోతిబసు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వ్యవసాయ రంగంలో అభివృద్ధి చెందినప్పటికీ రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడం కోసం బుద్ధదేవ్ పరితపించారని తెలిపారు. కమ్యూనిస్టు విలువలను కాపాడుతూ ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు, క్రోసూరు గ్రామ కార్యదర్శి చిలుక యేసయ్య, షేక్ ముస్తఫా, ఐలం గోపాలకృష్ణ, కంభంపాటి అనూష పాల్గొన్నారు.

కార్పొరేట్ రంగాన్ని తొలగించి దేశాన్ని కాపాడాలి

సత్తెనపల్లి: క్విట్ కార్పొరేట్ అంటూ కార్పొరేట్ రంగాన్ని తొలగించి వ్యవసాయాన్ని, దేశాన్ని కాపాడాలని రైతు సంఘం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య పిలుపు నిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధర్నాకు సీఐటీయు సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ అధ్యక్షత వహించారు. కార్పొరేట్ రంగాన్ని నిర్వీర్యం చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షకులు సంఘటితమై పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ధర్నాలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షురాలు మల్లేశ్వరి, కార్యదర్శి రజని, రైతు సంఘం నాయకులు నరసింహారావు, సీఐటీయు నాయకులు వెంకటనారాయణ, రాము, జగన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దేశ సంపదను కార్పొరేట్లకు మోదీ దోచిపెడుతున్నారు

క్రోసూరు: దేశ సంపదను కార్పొరేట్లకు మోదీ దోచిపెడుతున్నాడని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి రవిబాబు అన్నారు. శుక్రవారం అఖిలభారత రైతు, వ్యవసాయ కార్మిక, కార్మిక ప్రజా సంఘాల సమన్వయ కమిటీ పిలుపులో భాగంగా క్రోసూరు పోస్టాఫీస్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. రవిబాబు మాట్లాడుతూ మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతుందని అన్నారు. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాలను అమలు చేసేందుకు రాష్ట్రాలు ముందుకు రావడం దుర్మార్గమని అన్నారు. రైతు, కౌలు రైతు వ్యవసాయ కార్మిక సీఐటీయూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌లకు ఎన్డీఏ ప్రభుత్వం ఊడిగం

ముప్పాళ్ళ: కార్పొరేట్ శక్తులకు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఊడిగం చేస్తుందని, ఇలాంటి దుశ్చర్యలను అందరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని సీపీఎం మండల కార్యదర్శి గుంటుపల్లి బాలకృష్ణ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ, అఖిల భారత కిసాన్ సభ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో క్విట్ కార్పొరేట్ నినాదంతో నిరసన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహాశిల్పంపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

- లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు తప్పవు
- హెచ్చరించిన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రయ్య
- నల్ల బ్యాడ్జీలతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిరసన



అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



బెల్లంకొండలో అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అచ్చంపేట: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిచే రూపుదిద్దుకున్న న్యాయ మహాశిల్పం, భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి, దళితుల ఆరాధ్య దైవం డాక్టర్ అంబేడ్కర్ విగ్రహంపై దాడికి పాల్పడిన వారు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిల్కా చింద్రయ్య డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అధికారంలో ఉన్నవారే దాడిని ఖండించకపోవడంపై వారే ఈ దుశ్చర్యకు పాల్పడి ఉండవచ్చన్న అనుమానం కలుగుతోందన్నారు. అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని అలాంటి మహోన్నత వ్యక్తి విగ్రహంపై దాడికి పాల్పడటం క్షమించరాని నేరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రశ్నించడానికే పార్టీ పెట్టానన్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ రిజర్వేషన్‌తో హోం మినిస్టర్ అయిన అనిత దాడిపై స్పందించాల్సిన అవసరం ఉందన్నారు.

✦ మాజీ ఎంపీపీ భూక్యా కృష్ణానాయక్ మాట్లాడుతూ సామాజిక న్యాయ మహాశిల్పమైన అంబేడ్కర్ విగ్రహంపై దాడి క్షమించరాని నేరమని దీనికి చంద్రబాబే నైతిక బాధ్యత వహించవలసి ఉంటుందన్నారు. ఎంపీటీసీ యండ్రపల్లి నటరాజు మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంతోనే పాలన కొనసాగిస్తున్న పాలకులు దాడిపై స్పందించరా అని ప్రశ్నించారు. ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చే హోం మినిస్టర్ అనిత దాడిపై ఎందుకు పెదవి విప్పడం లేదన్నారు. మండల ఎస్సీ సెల్ కన్వీనర్ తిమోతి మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాలకే రక్షణ లేకపోతే ఈ ప్రభుత్వంలో దళిత వర్గాలకు రక్షణేదని ప్రశ్నించారు. దళితనేత మరియదాసు మాట్లాడుతూ ప్రాణాలైనా అర్పిస్తాం కానీ అంబేడ్కర్ విగ్రహంపై దాడిని మాత్రం సహించమన్నారు. కార్యక్రమంలో అచ్చంపేట సర్పంచ్ షేక్ జాని, మాజీ సర్పంచ్ కంబాల వీరబాబు, మరియదాసు, గంగాధర్, షేక్ నాగులు, సందెపోగు పున్నారావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

ప్రపంచ మేధావి, యావత్‌భారతావని ముద్దుబిడ్డ, దళితజాతి ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై దాడికి నిరసనగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జడ్పీహైస్కూలు వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరైన రాజ్యాంగం లేకపోవడం వల్ల శ్రీలంక, బంగ్లాదేశ్ లాంటి దేశాలు ఎలా కకావికలమైపోతున్నాయో చూస్తున్నామన్నారు. దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని ఇచ్చిన మహామేధావి అంబేడ్కర్ విగ్రహాలు దైవంతో సమానమన్నారు. అలాంటి గొప్ప నేత విగ్రహాన్ని దేశం గర్వించే విధంగా మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి విజయవాడ నడిబొడ్డులో రూ.400 కోట్లతో 125 అడుగుల ఎత్తులో ఆకర్షణీయంగా నిర్మించారన్నారు. అలాంటి మహాశిల్పంపై దాడి జరిగితే ఏమీ పట్టనట్లు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, హోం మినిస్టర్ చోద్యం చూసినట్టు చూస్తున్నారన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీటీసీ యండ్రపల్లి నటరాజు, సర్పంచ్ షేక్ జాని, మాజీ సర్పంచ్ కంబాల వీరబాబు, షేక్ నాగులు, మరియదాసు, అశోక్, గంగాధర్, పున్నారావు, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ తిమోతి తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అంబేడ్కర్ విగ్రహంపై రాజ్యోన్మాదం తగదు

బెల్లంకొండ: దళితుల ఆరాధ్య దైవం అయిన అంబేడ్కర్ విగ్రహంపై రాజ్యోన్మాదం తగదని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. గురువారం రాత్రి విజయవాడలో సామాజిక న్యాయ మహాశిల్పంపై పచ్చమూకల దాడికి వ్యతిరేకంగా బెల్లంకొండలో శుక్రవారం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలను ధరించి ప్రధాన సెంటర్‌లో నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం ప్రధానం సెంటర్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి ప్రసాదరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని.. రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందని, రాజ్యాంగ నిర్మాత విగ్రహానికే రక్షణ కరువైందని ఎద్దేవా చేశారు. అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదని, ప్రజలు మెచ్చే పాలన చేసి ప్రజాభిమానం పొందాలి తప్ప దాడులు, హత్యలకు దిగడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ నాయకులు మాటూరి చిట్టిబాబు, కొండలు, సర్పంచ్‌లు నరసింహానాయక్, లక్ష్మీనారాయణ, ప్రతాపరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ దరియా, మైనార్టీ సెల్ నాయకులు బడాబచ్చా మౌలాలి, కారుమూరి భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి దారుణం

అమరావతి: విజయవాడలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ న్యాయ మహాశిల్పంపై దాడి చేయడం దారుణమని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ గతంలో చంద్రబాబు రాజధాని నడిబొడ్డులో అంబేడ్కర్ విగ్రహం నిర్మిస్తానని మాట తప్పిన విషయంపై నిలదీసిన మాజీ మంత్రి మేరుగు నాగార్జునను అరెస్టు చేసిన విషయం గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి సీఎం కాగానే నిధులు కేటాయించి సామాజిక న్యాయ మహాశిల్పం నిర్మించి ప్రారంభించటం జరిగిందన్నారు. జగన్‌మోహన్ రెడ్డి హయాంలో పూర్తి చేసారు కనుక ఆయన పేరు వేయటం జరిగిందని కూటమి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నేతలు, కార్యకర్తలు జీర్ణించుకోలేక రాత్రి పూట కరెంటు తీసి పగులగొట్టటం హేయమైన చర్య అని అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ నాయకుడు దారా ప్రసాద్ మాట్లాడుతూ విజయవాడ నడి బొడ్డులో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేశారంటే రెడ్‌బుక్‌లో అంబేడ్కర్ పేరు కూడా రాసుకున్నారా..? అని ప్రశ్నించారు. శాంతిభద్రతలు క్షీణించి ప్రజాస్వామ్యం గాడి తప్పింది అనడానికి ఇంతకంటే నిదర్శనం అవసరం లేదన్నారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనుల శిలాఫలకాలు, ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలపైనా దాడులు చేయటం మంచి పద్ధతి కాదన్నారు. ఇలాంటి సంస్కృతిని ప్రజాస్వామ్య వాదులు, అంబేడ్కర్ ఆశయ సాధకులు ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మునగోడు సర్పంచ్ బంకా విష్ణు వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ హష్మీ, అలా లక్ష్మీనారాయణ, సూరిబాబు, కంభంపాటి శేషారావు, కంభంపాటి శంకర్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



బలిజేపల్లిలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రవితేజనాయక్

రాజుపాలెం: వాతావరణ పరిస్థితులు మారిన నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రవితేజనాయక్ తెలిపారు. మండలంలోని గణపవరం, బలిజేపల్లి గ్రామాలలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ రవితేజ నాయక్ సిబ్బందితో కలసి రహదారులను పరిశీలిస్తూ మురికి నీరు ఎక్కువగా ఉన్న చోట ఎబెట్ ద్రావణాన్ని చల్లించారు. అనంతరం గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణలో కొబ్బరి బొండాలు, పాత టైర్లు లేకుండా చూసుకోవాలని తెలిపారు. చలి, వణుకుతో కూడిన విపరీతమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, కడుపులో నొప్పి ఉంటే వెంటనే దగ్గరలోని పీహెచ్‌సీలో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ

క్రోసూరు: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఈ నెల 12 నుంచి 14 వరకు మూడురోజుల పాటు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులకు, సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో టీకే వెంకటరమణ శుక్రవారం తెలిపారు. ఏపీ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, పంచాయతీరాజ్ డైరెక్టర్(ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్)ఆదేశాల మేరకు శానిటేషన్ అండ్ సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు తప్పక హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ మాస పూజలు



జగన్నాథస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు



విశేషాలంకరణలో పెద్దింటమ్మ తల్లి



ప్రత్యేక అలంకరణలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు

సత్తెనపల్లి: తొలి శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని పట్టణంలోని మాచర్ల రోడ్డులో గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెద్దింటమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతిలో వేంచేసి ఉన్న గ్రామ దేవత పెద్దింటమ్మ తల్లి ఆలయంలో నూతనంగా సమర్పించిన అమ్మవారి పంచలోహ ఉత్సవ విగ్రహానికి శుక్రవారం సంప్రోక్షణ నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలతో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి కళాన్యాసం, ప్రాణ ప్రతిష్ఠ చేసి సంప్రోక్షణ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహానికి కుంకుమ పూజ, వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రావణ మాస ప్రత్యేక పూజలు

ముప్పాళ్ళ: శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయాల్లో స్వామి వార్లకు అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు. చాగంటివారిపాలెంలోని బలభద్ర సహిత జగన్నాథస్వామి వారి ఆలయం, ముప్పాళ్ళలోని కాశీఅన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి, నార్నెపాడులోని శంభులింగేశ్వరస్వామి, మాదల సాగరేశ్వరస్వామి ఆలయాల్లో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

వరిలో మేలు రకాల విత్తనాలను ఎంపిక చేసుకోవాలి

రాజుపాలెం: మండలంలోని కోటనెమలిపురి గ్రామ సచివాలయంలో వరిలో మేలైన యాజమాన్య పద్ధతులు, రైతులు విత్తన ఎంపికలో సరైన మెళకువలు పాటించాలని రైతులకు అవగాహన సమావేశం ఏవో పి.వెంకటనర్సయ్య శుక్రవారం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు అనువైన వరి విత్తనాలను ఎంపిక చేసుకోవాలని చెప్పారు. బీపీటీ 52-04 ఆగష్టు 15వ తేదీ లోపు నారు చల్లుకుని సెప్టెంబర్ 15వ తేదీ లోపు నాటుకుంటే అనువైన రకం అని తెలిపారు. నత్రజని వాడడం వలన ఎక్కువ కాల పరిమితితో పెరగడం వలన చీడ పీడలు ఆశించడానికి అవకాశం ఉంటుందని, నత్రజని తగ్గించినట్లయితే పంట కాల వ్యవధిని తగ్గించవచ్చని చెప్పారు. రైతులు స్వల్పకాలిక రకమైన జేజీఎల్ 384పై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని, దీనివలన మార్కెట్‌లో విత్తన కొరత ఏర్పడిందని తెలిపారు. ఈ రకానికి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1224 రకం విత్తనాన్ని కొన్నట్లయితే 125 నుంచి 130 రోజుల కాలపరిమితితో పాటు పంట పడిపోదు, దోమపోటు, అగ్గితెగులును తట్టుకుని మంచి దిగుబడి వస్తుందని తెలిపారు. మార్కెట్ రేటు ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జి.జయలక్ష్మీ, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదానికి గురైన యువకుడు మృతి

క్రోసూరు: ఉన్నత చదువులకు తమ కుమారుడు అమెరికా వెళుతున్నాడన్న తల్లిదండ్రులు కలలు క్షణాల్లోనే రోడ్డు ప్రమాదం రూపంలో ఆవిరయ్యాయి. క్రోసూరు విద్యానగర్‌కు చెందిన జగదీష్ రెడ్డి(22) ఈ నెల 7న అచ్చంపేట మండలంలోని తాళ్లచెరువు వెళ్లి తిరిగి వస్తుండగా అచ్చంపేట వే బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొట్టింది. తీవ్ర గాయాలపాలైన అతడికి గుంటూరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించారు. వైద్యులు కూడా ప్రాణహాని లేదని చెప్పారు. అయితే మరుసటి రోజు లాభం లేదని వైద్యులు తెలిపి వెంటిలేటర్‌పై ఉంచిన కొద్దిసేపటికే మృతి చెందాడు. మృతుడు గ్రామంలో పాలకేంద్రం నిర్వహిస్తున్న ప్రసాదరెడ్డి, సామ్రాజ్యం దంపతుల రెండవ కుమారుడు. వ్యవసాయాధారిత కుటుంబం. అంతేకాక శుక్రవారం పుట్టిన రోజు కూడా కావటంతో కుమారుడిని తలచుకుంటూ తల్లిదండ్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

విత్తన శుద్ధితో తెగుళ్లను అరికట్టవచ్చు

సత్తెనపల్లి: విత్తన శుద్ధి చేయటం వల్ల నేల, విత్తనాల ద్వారా వ్యాపించే తెగుళ్లను నారుమడి దశలోనే అరికట్టవచ్చని సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి ఎస్.శ్రీధర్ రెడ్డి అన్నారు. సత్తెనపల్లి మండలంలోని కందులవారిపాలెం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో వరి పంటలో జీఏపీ-పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ పొలంబడి కార్యక్రమంలో 25 ఎకరాల్లో వరి పంటను పండించే 30 మంది రైతులను ఎంపిక చేసుకొని వారికి 14 వారాల పాటు వరి సాగులో చేపట్టవలసిన సమగ్ర యాజమాన్య పద్ధతులను పొలంబడి తరగతుల ద్వారా తెలియజేస్తారన్నారు. వరి పంటలో విత్తన శుద్ధి ఉద్దేశం తెలుపుతూ ప్రయోగపూర్వకంగా కార్బెండిజం అనే శిలీంద్రనాశిని(3 గ్రా)తో కేజి వరి విత్తనాలకు విత్తన శుద్ధి చేయించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో వరి పండించే రైతులు ఒకే రకమైన విత్తనాల కొరకు ఇబ్బంది పడకుండా జేజీఎల్ 384 రకానికి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1224, కేఎన్ఎం 1638, ఎన్ఎల్ఆర్ 34449 రకాలు సాగు చేసుకోవచ్చన్నారు. ఈ వంగడాలు కూడా తక్కువ



కందులవారిపాలెంలో విత్తన శుద్ధి చేయిస్తున్న ఏవో శ్రీధర్‌రెడ్డి

కాల పరిమితిలో కోతకు వస్తాయని, మంచి దిగుబడులు ఇస్తాయన్నారు. ఈ రకాలు ఏపీ సీడ్స్ వద్ద అందుబాటులో ఉన్నాయని, ఈ రకాలకు ప్రభుత్వం కేజీ విత్తనానికి రూ.5 సబ్సిడీ కూడా అందజేస్తుందన్నారు. ఈ రకాలు జెజీఎల్ 384 కన్నా అధిక దిగుబడులు ఇస్తాయని, చీడ పీడలు కొంతవరకు తట్టు కోగలవన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు ఎస్.ప్రశాంత్, రైతులు, పాల్గొన్నారు.

ఆదివాసీలు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

సత్తెనపల్లి: ఆదివాసీలు అవకాశాలను అందిపుచ్చుకొని అభివృద్ధే ధ్యేయంగా ముందుకు నడవాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ సీఈవో అల్లడి దేవకుమార్ అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో డీబీఆర్సీ రీజనల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షతన శుక్రవారం జరిగిన అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆదివాసీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని, మీ పిల్లలకు విద్యను అందించే విధంగా చూడాలన్నారు. అంబేడ్కర్ అందించిన రాజ్యాంగం ద్వారా ఉన్న అవకాశాలను, హక్కులను ఆదివాసీలు అందిపుచ్చుకోవాలన్నారు. పల్నాడు జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ ఓబుల్ నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ఆదివాసీలకు ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని, అవి మీరు పొందాలన్నారు. సత్తెనపల్లి మండల విద్యాశాఖ అధికారి ఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆదివాసీలు ప్రారంభంలో కొండలు, గుట్టలు, చెరువులు, కాలువలు, వాగులు, వంకల ప్రాంతంలో నివసిస్తూ ఆహారం సంపాదించుకొని జీవన విధానం కొనసాగించేవారన్నారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్.జగదీష్, మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్ మధుసూదనరావు, ఎంఈఓ-2 రాఘవేంద్రరావు, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సుబ్బారావు, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏరియా కోఆర్డినేటర్ మేడే వెంకటరమణ, గడ్డిపట్టి కోటిరత్నం, వివిధ గ్రామాల ఆదివాసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దళిత బహుజన రిసోర్స్ సెంటర్ సీఈవో అల్లడి దేవకుమార్

ఆర్టీఐ యాక్ట్‌పై అవగాహన సదస్సు

ముప్పాళ్ళ: రాష్ట్ర సమాచార కమిషనర్ ఉత్తర్వులు, జిల్లా వ్యవసాయ శాఖ ఆదేశానుసారం మండలంలోని చాగంటివారిపాలెం రైతు భరోసా కేంద్రంలో సమాచారహక్కు చట్టం-2005 పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మండల, గ్రామ స్థాయి అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్న సదస్సులో తహసీల్దార్ భవానిశంకర్ సమాచారహక్కుచట్టం-2005 ముఖ్య ఉద్దేశం, ఉపయోగాలు, లక్ష్యాలు వివరించారు. ప్రతి ఒక్కరూ ఈ చట్టం ద్వారా తమకు కావాల్సిన సమాచారాన్ని పొందవచ్చన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు చట్ట పరిధిలోకి ఎవరెవరు వస్తారో వివరించారు. ప్రోగ్రామ్ రీసోర్స్ పర్సన్ డి.ఇమ్మానియేల్ సమాచారహక్కుచట్టం ఉన్న సెక్షన్‌లను వివరించారు. ఏవో అరుణ సమాచారహక్కుచట్టం పొందేందుకు చెల్లించాల్సిన ఫీజు వివరాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ స్థాయి అధికారులు, వీఏఏ, వీహెచ్‌ఏలు, సర్వేయర్లు పాల్గొన్నారు.



ఆర్టీకేలో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏవో అరుణ

సంక్షిప్త వార్తలు

ప్రత్యామ్నాయ విత్తనాలపై దృష్టి సారించాలి

నకరికల్లు: రైతులు ఎక్కువగా అడుగుతున్న జేజీఎల్ 384 రకం వరి విత్తనాల లభ్యత లేనందున ప్రత్యామ్నాయ విత్తనాలపై దృష్టి సారించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీకృష్ణదేవరాయలు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులతో శుక్రవారం మాట్లాడారు. జేజీఎల్ 384 వరి రకానికి ప్రత్యామ్నయంగా కేఎన్ఎం 1638, ఎంటీయు 1224 రకాలు వాడవచ్చన్నారు. ప్రస్తుత డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని కేఎన్ఎం 1638 విత్తనాలు 107 క్వింటాలు, ఎంటీయు 1224 రకం విత్తనాలు 133 క్వింటాలు పంపిణీకి సిద్ధం చేసినట్లు తెలిపారు. వరి విత్తనాలు కావలసిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించవచ్చన్నారు. సమావేశంలో ఏవో దేవదాసు, రైతులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలి

ముప్పాళ్ళ: వీఆర్‌ఏలకు వెంటనే పే స్కేల్ అమలు చేయాలని, అర్హత ఉన్న వారందరికీ వీఆర్వోగా వన్‌టైం సెటిల్మెంట్ ద్వారా ప్రమోషన్ ఇవ్వాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ బందగి సాహెబ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న బందగీసాహెబ్ మాట్లాడుతూ నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా గుర్తించాలని, అటెండర్ నైట్‌వాచ్మెన్ డ్యూటీలను రద్దు చేయాలన్నారు. అక్రమ డ్యూటీలను వెంటనే రద్దు చేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ తహసీల్దార్ భవానిశంకర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి బుడే, మండల కోశాధికారి సరిత, మాబు, సుభాని, శివపార్వతి, గాలయ్య, నాగరాజు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

సత్తెనపల్లి: మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం పణిదం పీహెచ్‌సీలో వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు శుక్రవారం మధ్యాహ్నం పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కుంచనపల్లి కిరణ్, మాగులూరి కృష్ణారావు, గంగూరి అమరేశ్వరరావు, కొండవీటి ప్రసాద్, భాష్యం కోటేశ్వరరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోనో కార్పస్ చెట్లను తొలగించాలి

అమరావతి: పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే కోనో కార్పస్ చెట్లను వెంటనే తొలగించాలని విద్యా భారతి ఆంధ్రప్రదేశ్ పర్యావరణ ప్రముఖ్ కోలా వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. వర్షాకాలంలో అవి పూతకు వస్తాయని వాటి పుప్పొడి రేణువుల వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు అనేక శ్వాసకోశ సంబంధ వ్యాధులకు గురి అవుతారన్నారు. పక్షి వాలని చెట్టుగా వీటికి పేరుందని ఈ చెట్లు దోమలను, కీటకాలను ఆకర్షించి పర్యావరణానికి హాని కలిగిస్తాయన్నారు. వీటి వేరు వ్యవస్థ బలంగా ఉండి భూగర్భ జలాలను ఎక్కువగా ఉపయోగించి నీటి కొరత ఏర్పడే విధంగా చేస్తాయన్నారు. మానవాళికి హాని కలిగించే ఈ చెట్లను తొలగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.